
# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

- గద్వాల కలెక్టర్ సంతోష్
- గట్టు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే బండ్ల

గట్టు, జూన్ 19 : అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ స్పష్టం చేశారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గద్వాల నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరుకాగా, అత్యధికంగా 780 ఇండ్లు గట్టు మండలానికి కేటాయించినట్లు వెల్లడించారు. మొదటి విడత పూర్తయిన వెంటనే అర్హులకు రెండో విడతలో ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో గట్టు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ, గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకటేశ్, ఎంపీడీవో చెన్నయ్య, మాజీ జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్, నాయకులు గట్టు తిమ్మప్ప, జంబు రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందచేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



వెల్టూరులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ఆపొద్దు

- నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెద్దమందడి, జూన్ 19 : ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మండలంలోని వెల్టూరుకు చెందిన పద్మమ్మ భర్త నాగేశ్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, గురువారం కలెక్టర్, తాసీల్దార్ భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా జియో ట్యాగింగ్ చేసి ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనంలో లబ్ధిదారులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెల్టూరుకు 34ఇండ్లు మంజుర య్యాయని, లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ సరస్వతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

కొత్తకోట, జూన్ 19 : భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం కొత్తకోట మండలం వడ్డెవాటలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. మ్యుటేషన్, సక్సేషన్, సాదా బైనామా, ఆర్ఎస్ఆర్ వంటివి నోటీసులు జారీ చేసి పరిశీలన అనంతరం పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం వడ్డెవాటలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆషాడం, ఇతరాత్ర సాకులు చెబుతూ నిర్మాణాలు పెండింగ్‌లో పెట్టొద్దని, చెప్పిన సమయంలో ప్రారంభించకుంటే మంజూరైన ఇండ్లు రద్దు అవుతాయని తెలిపారు.

## బీచుపల్లి అంజన్నను దర్శించుకున్న మంత్రి



పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఇటిక్యాల, జూన్ 19 : నడిగడ్డ ఇలవేల్పు బీచుపల్లి అంజన్నను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం దర్శించుకొన్నారు. మంత్రికి ఆలయ కార్యనిర్వహణ అధికారి రామన్ గౌడ్ ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావ్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎస్పీ మొగిలయ్య, తాసీల్దార్ నరేశ్ తదితరులు ఉన్నారు.

## ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జూన్ 19 : ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగమని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం సుల్తానాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఆరోగ్య ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిని ఎల్లప్పుడూ కృషి చేస్తానని వెల్లడించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రామన్న తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ

వనపర్తి టౌన్, జూన్ 19 : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వాసంతి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా గురువారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్

మదనాపురం, జూన్ 19 : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదని ప్రస్తుత ఎమ్మెల్యే దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదని మాజీ జెడ్పీటీసీ మహానంది కృష్ణయ్య యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూరాల నుంచి దిగువకు నీళ్లు తరలి పోతుంటే నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు వస్తున్నప్పుడే మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిరామన్‌పాడు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతల పథకాలను నింపేవారని గుర్తుచేశారు. 15రోజులుగా జలాలు దిగువకు వెళ్తున్నా పట్టనట్లు వ్యవహరించడం రైతులపై కాంగ్రెస్ నేతలకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతున్నదన్నారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావొస్తున్నా ప్రొసిడింగ్, గొప్పలు చెప్పడమే తప్పా చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు ఏనాడూ తాగు, సాగునీటికి ఇబ్బందులు పడిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ వచ్చిన మూడు నెలలకే రైతులు రోడ్లపైకి రావాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. మార్పు పేరిట అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి, గ్రామాధ్యక్షుడు మాలకృష్ణ, మాజీ సర్పంచులు విజయేందర్ రెడ్డి తిరుపతయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మార్కెట్ మాజీ డైరెక్టర్ సత్యం యాదవ్, సీనియర్ నాయకులు అచ్యుతారెడ్డి, రమేశ్, సూరిబాబు, శ్రీనివాసులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

గద్వాల అర్బన్, జూన్ 19 : రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమరు రూ.8వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని, వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కాలేజీల్లో బీటెక్, బీ ఫార్మసీ పూర్తిచేసిన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫైనల్ ఇయర్ తర్వాత సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యం ససేమిరా అంటుండడంతో ఫీజు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీజీ ఈ సెట్‌లో సీట్ సాధించి వదులుకున్న వారు చాలా మంది ఉన్నారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి పరిపాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు మాధవ్, మహేశ్, రంగస్వామి, చక్రి తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

గద్వాల టౌన్, జూన్ 19 : నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ, సరస్వతి పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న పుస్తకాలను, యూనిఫామ్స్‌ను విద్యార్థి సంఘాల నాయకులు గురువారం గుర్తించి విద్యాశాఖ మండల అధికారికి విషయం చేరవేశారు. నిర్ణీత ధర లేకుండా పుస్తకాలను ఎలా విక్రయిస్తున్నారని, పాఠశాలలో పుస్తకాలను విక్రయించేందుకు అనుమతులు ఉన్నాయా అంటూ పాఠశాలల నిర్వాహకులను అధికారులు ప్రశ్నించారు. టై బెల్ట్, షూస్ కూడా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హాలీంపాషా సుభాన్ ఉన్నారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు

పెద్దమందడి, జూన్ 19 : మద్యం మత్తులో ఓ మహిళపై లైంగికదాడి చేసి ఆపై హత్య చేసిన ఘటన పెద్దమందడి మండలం గట్లఖానాపూర్‌లో చోటుచేసుకున్న ఘటన కేసును పోలీసులు ఛేదించినట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని గట్ల ఖానాపూర్‌కు చెందిన హరిజన్ రేణుక(41)ను అదే గ్రామానికి చెందిన కురుమూర్తి మద్యం మత్తులో లైంగికదాడి చేసి, ఆమెపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కొత్తకోట సీఐ రాంబాబు, పోలీస్ బృందం 24 గంటల్లోనే కేసును ఛేదించి నిందితుని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకోవడంతో అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు ఛేధనలో ఎస్సై శివకుమార్, శిక్షణ ఎస్సైలు దివ్య, హిమబిందు, నరేశ్, కానిస్టేబుల్ భూపాల్, రాకేశ్ చేసిన కృషికి డీఎస్పీ అభినందించారు.

## కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు అన్యాయం

పాన్‌గల్, జూన్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రూనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చట్టసభల్లో ఒక్క గిరిజనుడికి మంత్రి పదవి, కార్పొరేషన్ పదవుల్లో సరైన ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు జాత్రూనాయక్, చంద్రశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ దాడులను అరికట్టాలి

పాన్‌గల్, జూన్ 19 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో పార్టీ మండలి కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్‌పై జరుగుతున్న దాడులను మానవతావాదులంతా ఖండించాలని కోరారు. అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించేవిధంగా అమెరికా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటయ్య, రాము, భీమయ్య, జంబులయ్య, కృష్ణయ్య, బాల్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**యుద్ధంతో ప్రపంచానికి పెనుముప్పు**

గద్వాల టౌన్, జూన్ 19 : ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం ప్రపంచానికి పెనుముప్పని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. యుద్ధాల కారణంగా సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక, విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలు సర్వనాశనమవుతున్నాయన్నారు. యుద్ధాలకు కారణం అమెరికా సామ్రాజ్యవాద వైఖరే కారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ప్రభాకర్, ఆశన్న, రంగన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుకు 24 దరఖాస్తులు

గట్టు, జూన్ 19 : మండలంలోని మాచర్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతుల నుంచి 24 దరఖాస్తులను స్వీకరించినట్లు తాసీల్దార్ మదన్ మోహన్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ విజయకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, జూన్ 19 : ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పరిసరాలను, నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో ఆలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**కళలు సంస్కారాన్ని ప్రభోదిస్తాయి**

పెబ్బేరు, జూన్ 19 : కళలు మానసిక ఆనందాన్ని కల్గించడమే గాకుండా..గొప్ప సంస్కారాన్ని ప్రభోదిస్తాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శ్రీరంగాపురం మండలం వెంకటాపురంలో గ్రామస్తులు ప్రదర్శించిన మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనకు ఆయన గురువారం తెల్లవారు జామున హాజరై చివరి ఘట్టమైన జీవ సమాధి ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో వనపర్తి ఎక్సైజ్ సీఐ వెంకట రెడ్డి శ్రీరంగాపురం ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

**ఎస్పీ దంపతుల ప్రత్యేక పూజలు**

అలంపూర్, జూన్ 19 : దక్షిణ కాశీగా పేరొందిన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గురువారం ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. ఉభయ ఆలయాల్లో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట అలంపూర్ సీఐ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులు

వనపర్తి టౌన్, జూన్ 19 : జిల్లావ్యాప్తంగా మధుమేహ పరీక్ష ఫలితాలను వెంటనే ఆన్ లైన్‌లో నమోదు చేసి, నమోదైన కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. డయాబెటీస్ నమోదైన వారికి హెచ్‌బీ ఏ-1సీ పరీక్షలు నిర్వహించి ల్యాబ్‌లో పరీక్ష ఫలితాలు సరిగా నమోదయ్యాయో లేదో చూడాలన్నారు. ప్రతి టెస్ట్‌ను, నిర్వహణ తేదీ, బార్ కోడ్ వివరాలు సంబంధిత లిస్ట్‌లో అచ్చుగా నమోదు చేయాలన్నారు. జులై 31లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు రాంచందర్‌రావు, ఝాన్సీ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు

## వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

ఇటిక్యాల, జూన్ 19 : జులై మొదటి వారంలో ప్రారంభమయ్యే వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని అడిషినల్ కలెక్టర్ నర్సింగ్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని నర్సరీని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ముంగిట 5మొక్కలు పెంచుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాకనాలంలో మొక్కలు నాటడం వల్ల వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అజర్ మొహియుద్దీన్, ఏపీవో శివ జ్యోతి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

## తిమ్మాజిపల్లెలో అక్షరాభ్యాసం

వడ్డేపల్లి, జూన్ 19 : మండలంలోని తిమ్మాజిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నర్సింహ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కాగా, గ్రామంలోని విద్యార్థులను పదేండ్లుగా ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలకే పంపించడంపై తల్లిదండ్రులను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదయ్య, ఉపాధ్యాయులు దేవేందర్, వెంకట్రాములు, దస్తగిరి, గ్రామస్తులు నాగేశ్ యాదవ్, గౌని, వీరేశ్, నాగేశ్, లక్ష్మన్న, కుమార్, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

వనపర్తి టౌన్, జూన్ 19 : ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు సలహాలు, సూచనల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం వేణుగోపాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ప్రయాణికులు 73828 26289 నెంబర్‌కు ఫోన్ చేసి ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గోపాల్‌పేట, జూన్ 19 : మండల కేంద్రానికి చెందిన గంధం గోకారయ్య(75) అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. మండల కమిటీ ఉపాధ్యక్షులు కర్రోళ్ల స్వప్న రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు భాస్కర్, శేఖర్, ఓంకార్, లక్ష్మయ్య, వెంకటయ్య, కుమార్, రాములు తదితరులు ఉన్నారు.

## పశువులకు టీకాలు

ధరూరు, జూన్ 19 : పాడి రైతులు పశువులకు వ్యాధులను తట్టుకునేలా టీకాలు వేయించాలని మండల పశువైద్య శాఖాధికారి వెంకటరాజ్ సూచించారు. గురువారం మండలంలోని బూరెడ్డిపల్లిలో పశువులకు లంపీస్కిన్, ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకాలు వేశారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఖిల్లా ఘణపురం, జూన్ 19 : మండల కేంద్రంలో శాంతి భద్రత పరిరక్షణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు మాజీ సర్పంచ్ వెంకటరమణ రూ.10వేల విరాళాన్ని ఎస్సై సురేశ్‌గౌడ్‌కు గురువారం అందజేశారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రాజోళి, జూన్ 19 : పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని గురువారం ప్రత్యేకాధికారి ఖాజావలీ, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్యకు సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థినికి సన్మానం

గట్టు, జూన్ 19 : మండలంలోని మాచర్ల జెడ్పీ హైస్కూల్‌లో జై నడిగడ్డ యూత్ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి మండల టాపర్ ఇంద్రజను తాసీల్దార్ మదన్ మోహన్ గౌడ్‌సన్మానించారు.

## సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

అలంపూర్ చౌరస్తా, జూన్ 19 : ఉండవల్లి మండలం మారమునగలకు చెందిన చిన్న మద్దిలేటి నాయుడు గుడిసెలో చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం చికెన్ వండుతుండగా సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. మద్దిలేటి బయటకు పరుగులు తీశాడు. దీంతో గుడిసెలోని వస్తువులతోపాటు 20 కోళ్లు మృతిచెందాయి. రూ.50వేల అస్తి నష్టం జరిగిందని స్థానికులు తెలిపారు.

## ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీ

వనపర్తి టౌన్, జూన్ 19 : నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం స్టాఫ్ సెలక్షన్ ద్వారా ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రాంతీయ సంచాలకులు రాహుల్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 9వ తేదీన నోటిఫికేషన్ వెలువడిందని పూర్తి వివరాల కోసం https://ssc.gov.in, api/attachment/aploads/master వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. జులై 4న దరఖాస్తు ప్రక్రియ ముగుస్తుందని, పోటీ పరీక్షలకు ఆగస్టు 15 నుంచి 30వ తేదీ వరకు 25 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని సూచించారు.

**దరఖాస్తుల ఆహ్వానం..**

వనపర్తి జిల్లా పరిధిలోని ప్రైమరీ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు గాంధీ నగర్, పీర్లగుట్టలో ఉన్న కేంద్రాలలో పనిచేసేందుకు గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుండి ఎంబీబీఎస్ పాసై ఉండాలని, తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి నుంచి తప్పనిసరిగా నమోదు అయి ఉండాలని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటాను, విద్యార్హత, ఆధార్ ధ్రువపత్రాలను వనపర్తి జిల్లా వైద్య కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. వివరాలకు 94407 31804 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

**గడువు పొడిగింపు..**

మహిళా , శిశు, వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉపకరణాల కోసం దరఖాస్తు తేదీని పొడిగించడం జరిగిందని జిల్లా సంక్షేమాధికారి సుధారాణి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జూన్ 27 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని ఆమె సూచించారు. అదేవిధంగా వనపర్తి జిల్లాలో డ్రగ్ అండ్ డీఅడిక్షన్ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారిని సుధారాణి చెప్పారు. ఆసక్తి గల స్వచ్ఛంద సంస్థలు వారు e-anudan (http:grants-mhje.gov.in/ngo-loginలో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## నేడు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

అయిజ, జూన్ 19 : రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశం పొందేందుకు శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో రాములు తెలిపారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని పీడీలు, పీఈటీలతో ఎంఈవో సమావేశం నిర్వహించి ఎంపిక చేయాల్సిన విధానం, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. మండల స్థాయిలో 20న, జిల్లాస్థాయిలో 23 నుంచి 26 వరకు, జులై 1 నుంచి 6వ తేదీ వరకు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఒక్కో పాఠశాలలో 20 బాలురు, 20 బాలికలకు సీట్లు ఉంటాయని చెప్పారు. 1 సెప్టెంబర్ 2016 నుంచి 30, ఆగస్టు 2017 మధ్య జన్మించిన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

**దరఖాస్తు చేసుకోవాలి..**

అలంపూర్ చౌరస్తా, జూన్ 19 : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025-26 సంవత్సరానికి నాలుగో తరగతి ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి రామకృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలను ప్రారంభించారు.

## డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

ధరూరు, జూన్ 19 : మండల కేంద్రంలోని ఎంజేపీ ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో మహిళా విద్యార్థుల నుంచి స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేనప్ప గురువారం ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన విద్యార్థులు ఈనెల 23వ తేదీలోగా ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.